## మూడవ ప్రకరణం

# లోకమంతా దైవాజ్ఞకు కట్టుబడి ఉంది

ఈ జగతి అంతా – భూమ్యాకాశాలు, నక్షత్రాలు, గ్రహాలు, వృక్షజాలం, జంతు జాలం, కొండలు, నదీనదాలు, సముద్రాలు, ఎడారి ప్రదేశాలు, దైవదూతలు, జిన్నాతులు, మనుషులు – సమస్తం అల్లాహ్ ఆజ్ఞకు లోబడి ఉన్నాయి. అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు:

﴿وَلَهُ أَسْلَمَ مَن فِي السَّمَاوَاتِ وَالْأَرْضِ طَوْعاً وَكَرْهاً﴾ (آل عمران:٨٣)

**"ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్నవారంతా – తమకు ఇష్టమున్నా లేకపోయినా – అల్లాహ్ విధేయతకు కట్టుబడి ఉన్నారు."**

**(ఆలి ఇమ్రాన్ : 83)**

﴿بَل لَّهُ مَا فِي السَّمَاوَاتِ وَالْأَرْضِ كُلٌّ لَّهُ قَانِتُونَ﴾ (البقرة:١١٦)

**'భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయనదే. అవన్నీ ఆయన ఆజ్ఞకు తలఒగ్గి ఉన్నాయి." (అల్ బఖర : 116)**

ఇంకా ఇలా సెలవిచ్చాడు :

﴿وَلِلَّهِ يَسْجُدُ مَا فِي السَّمَاوَاتِ وَمَا فِي الْأَرْضِ مِن دَابَّةٍ وَالْمَلَائِكَةُ وَهُمْ لَا يَسْتَكْبِرُونَ﴾ (النحل:٤٩)

**"నిశ్చయంగా ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్న సమస్త ప్రాణులు, దూతలు – అందరూ అల్లాహ్ సన్నిధిలో సాష్టాంగపడుతున్నారు – ఏమాత్రం అహంకారం చూపటం లేదు. (అన్ నహ్ల్ : 49)**

ఈ విధంగా కూడా సెలవీయబడింది :

﴿أَلَمْ تَرَ أَنَّ اللَّهَ يَسْجُدُ لَهُ مَن فِي السَّمَاوَاتِ وَمَن فِي الْأَرْضِ وَالشَّمْسُ وَالْقَمَرُ وَالنُّجُومُ وَالْجِبَالُ وَالشَّجَرُ وَالدَّوَابُّ وَكَثِيرٌ مِّنَ النَّاسِ﴾ (الحج:١٨)

**"ఆకాశాలలో ఉన్నవారు, భూలోకవాసులు, సూర్యచంద్రులూ, నక్షత్రాలు, పర్వతాలు, వృక్షాలు, జంతువులు, చాలామంది మనుషులు కూడా అల్లాహ్ ముందు మోకరిల్లడాన్ని నువ్వు గమనించటం లేదా?"**

**(అల్ హజ్జ్ : 18)**

﴿وَلِلَّهِ يَسْجُدُ مَن فِي السَّمَاوَاتِ وَالْأَرْضِ طَوْعاً وَكَرْهاً وَظِلَالُهُم بِالْغُدُوِّ وَالْآصَالِ﴾ (الرعد:١٥)

**"ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్న సృష్టితాలన్నీ-తమకు ఇష్ట మున్నా, లేకపోయినా – అల్లాహ్‌కు సాష్టాంగపడుతున్నాయి. వాటి నీడలు సయితం ఉదయం, సాయంత్రం (ఆయనకు సజ్దా చేస్తున్నాయి)." (అర్రాద్ : 15)**

ఈ విధంగా ఈ సమస్త జగతి, అందులో ఉన్నవన్నీ అల్లాహ్‌కు విధేయత కనబరుస్తు న్నాయి. అవన్నీ ఆయన సార్వభౌమత్వానికి లోబడి వ్యవహరిస్తున్నాయి. విశ్వవ్యవస్థ అంతా ఆయన తలచుకున్నట్లుగా, ఆయన ఆజ్ఞకు కట్టుబడి నడుస్తోంది. విశ్వ వ్యవస్థలోని ఏ వస్తువు కూడా దైవాజ్ఞను ఎదిరించడానికి సాహసించదు. ప్రతిదీ ఒక కట్టుదిట్టమయిన వ్యవస్థకు లోబడి తన బాధ్యతలను నిర్వర్తిస్తోంది. తన కర్తవ్యాన్ని నెరవేరుస్తోంది. వాటిలో ప్రతి ఒక్కటీ తన సృష్టికర్తను అన్ని రకాల లోపాలకు అతీతంగా – దౌర్బల్యం లేనివానిగా ఖరారు చేస్తోంది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

تسبح له السماوات السبع والأرض ومن فيهن وإن من شيء إلا يسبح بحمده ولكن لا تفقهون تسبيحهم ﴿الاسراء:٤٤﴾

**"సప్తాకాశాలు, భూమి, వాటిలో ఉన్నవన్నీ ఆయన పవిత్రతనే కొనియాడుతున్నాయి. ఆయన స్తోత్రంతో పాటు ఆయన పవిత్రతను కొనియాడని వస్తువంటూ ఏదీ లేదు. అయితే మీరు వాటి స్తుతిని గ్రహించలేరు." (అల్ ఇస్రా : 44)**

కాబట్టి ఈ సృష్టితాలన్నీ – అవి మౌనంగా ఉండేవయినా, మాట్లాడేవైనా, సజీవు లైనా, నిర్జీవులైనా – అన్నీ అల్లాహ్‌కు విధేయులై ఉన్నాయి. తిరుగులేని ఆయన ఆజ్ఞను శిరసావహిస్తూ ఉన్నాయి. అవి మనసా, వాచా, కర్మణా అల్లాహ్ పవిత్రతను కొనియాడుతూ, ఆయన్ని దోషరహితునిగా ప్రకటిస్తున్నాయి. విజ్ఞుడైన వ్యక్తి ఈ సృష్టితాలపై చింతన చేసినపుడు అతనికి స్పష్టంగా అవగతమవుతుంది : ఇవన్నీ సత్యబద్ధంగా పుట్టించబడ్డాయి. సత్యం కోసమే పుట్టించబడ్డాయి. ఇవన్నీ తమ సృష్టికర్తకు లోబడి ఉన్నాయి. అవి తమ నిర్వాహణకర్త ఆజ్ఞను జవదాటలేవు. ఆయనకు వ్యతిరేకంగా వ్యూహాన్ని రచించటంగానీ, తిరుగుబాటు చేయటంగానీ చేయలేవు – ఈ విధంగా సృష్టితాలన్నీ సహజంగానే తమ సృష్టికర్తను అంగీకరిస్తున్నాయి.

షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (رحمه الله) ఇలా అంటున్నారు : "కొన్ని కారణాల దృష్ట్యా మనుషులు అల్లాహ్ ఆజ్ఞలకు తలఒగ్గి ఉన్నారు. ఆయన ఎదుట తల ఒగ్గటం, ఆత్మ సమర్పణ చేసుకోవటం తప్ప వారికి మార్గాంతరం లేదు."

- ◆ తాము అల్లాహ్‌పై ఆధారపడినవారమని, తమకు అల్లాహ్ అవసరం ఉందని వారికి తెలుసు.
- ◆ తమపై దేవుని ఏ ఇచ్ఛ, విధివ్రాత నెలకొని ఉన్నదో దాని ముందు ఎట్టి

పరిస్థితిలోనూ తలవంచక తప్పదని వారికి తెలుసు.

- కష్టాలు, విపత్కర పరిస్థితులలో అల్లాహ్‌ను మొరపెట్టుకోవటం తప్ప వారికి వేరే గత్యంతరం లేదు.

విశ్వాసి (మోమిన్) మనస్ఫూర్తిగా దైవాజ్ఞలకు తల ఒగ్గుతాడు. అలాగే అల్లాహ్ తన జాతకంలో ఏ కష్టాలు కడగండ్లను వ్రాసిపెట్టినా అతను దైవాజ్ఞానుసారం – సంతోషపూర్వకంగా – సహిస్తాడు. ఆత్మ పరిశీలన చేసుకుంటాడు. మొత్తానికి అతను సర్వకాల సర్వావస్థల్లో హృదయపూర్వకంగా అల్లాహ్ విధేయుడుగా రాణిస్తాడు. (మజ్మూఅ అల్ ఫతావా – 1/45). అలాగే ఒక అవిశ్వాసి (కాఫిర్) కూడా తన ప్రభువు యొక్క తిరుగులేని ఆజ్ఞ ముందు నిస్సహాయుడుగా ఉన్నాడు. ఈ జగతి అంతా సాష్టాంగ ప్రణామం చేస్తోంది అంటే భావం లోబడి ఉందనేదే. ప్రతి వస్తువు యొక్క సాష్టాంగ ప్రణామం (సజ్దా) దాని స్థితిని బట్టి ఉంటుంది. తన ప్రభువు పట్ల ఆత్మ సమర్పణా భావం అందులో అంతర్లీనమై ఉంటుంది. ఏ వస్తువు దేవుని పవిత్రతను కొనియాడినా అది వాస్తవికతతో కూడుకుని ఉంటుంది."

﴿أَفَغَيْرَ دِينِ اللَّهِ يَبْغُونَ وَلَهُ أَسْلَمَ مَن فِي السَّمَاوَاتِ وَالْأَرْضِ طَوْعًا وَكَرْهًا وَإِلَيْهِ يُرْجَعُونَ﴾ (آل عمران:٨٣)

**"ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్న వారంతా – తమకు ఇష్టమున్నా లేకపోయినా అల్లాహ్ విధేయతకు కట్టుబడి ఉండగా, వీరు అల్లాహ్ ధర్మాన్ని కాకుండా మరో ధర్మాన్ని అన్వేషిస్తున్నారా? ఎట్టకేలకు వారంతా ఆయన వైపునకే మరలించబడతారు."**

**(ఆలి ఇమ్రాన్ : 83)**

ఈ దైవసూక్తి గురించి షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (رحمه الله) ఇలా వ్యాఖ్యానించారు:

నిఖిల జగతి ఇష్టమున్నా లేకున్నా – రెండు పరిస్థితుల్లోనూ తన ఆజ్ఞకు కట్టుబడి ఉందని పవిత్రుడగు అల్లాహ్ చెబుతున్నాడు. అందువల్ల సృష్టితాలన్నీ సంపూర్ణంగా ఆయనకు దాసులే. ఆయన సేవకులే. ఎవరు అవునన్నా కాదన్నా – వారంతా ఆయన ప్రణాళికకు కట్టుబడినవారే. ఏ ప్రాణీ ఆయన ఇచ్ఛను ఎదిరించి ఆయన విధించిన విధివ్రాత నుండి బయటపడటం సంభవం కాదు. ఆయన అనుజ్ఞ, ఆయన సద్బుద్ధి లేకుండా ఏదైనా నష్టం నుండి తప్పించుకునే శక్తిగాని, ఏదైనా లాభాన్ని పొందే శక్తిగానీ ఎవరికీ లేదు. ఆయన సకల లోకాలకు ప్రభువు. అధిపతి, యజమాని. వాటిపై ఆయన కోరిన విధంగా అధికారం చెలాయించగలడు. ఎందుకంటే వాటన్నింటినీ సృష్టించినవాడు ఆయనే గనక. వాటన్నింటి రూపకర్త కూడా ఆయనే. ఆయన తప్ప మిగిలినవన్నీ ఆయన పోషణలో ఉన్నవే. అవన్నీ సృష్టితాలే. అవన్నీ అవసరం గలవే. ఆధారపడి ఉన్నవే. నిస్సహాయమైనవే. అల్లాహ్ ఒక్కడే అక్కరలేనివాడు. సర్వశక్తుడు, తిరుగులేనివాడు. పుట్టించేవాడు, నిర్మాత, రూపకల్పన చేసేవాడు." (మజ్మూఅ అల్ ఫతావా : 10/20).